

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.



19న ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కె.మల్లికార్జునరావు, కె.రామకోటేశ్వరరావు సోమవారం తెలిపారు.



బగళాముఖి సన్నిధిలో జిల్లా జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి అమ్మవారిని బాపట్ల జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ విశేషాలు కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

బాలాత్రిపుర సుందరిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రెండోరోజు బాలాత్రిపుర సుందరిదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. చండీ, రుద్రహోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశికచంద్రశేఖరశర్మ బాలాత్రిపుర సుందరిదేవి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండోరోజు అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా కటాక్షించారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

సాగర్ జలాలు వృథా చేయకండి

ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి



18వ మైలురాయి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ వరలక్ష్మి

శావల్యాపురం: సాగర్ జలాలు వృథా చేయరాదని నరసరావుపేట లింగగుంట్ల ఎన్‌ఎస్పీ ఎస్‌ఈ డి.వరలక్ష్మి చెప్పారు. సోమవారం మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు విడుదలవుతున్న సాగర్ జలాల సామర్థ్యాన్ని ఎన్‌ఎస్పీ అధికారులు పరిశీలించారు. ఎస్‌ఈ వరలక్ష్మి మాట్లాడుతూ సాగర్ జలాశయంలో నీటిమట్టం తక్కువగా ఉన్నందున తాగునీటి కోసమే ప్రభుత్వం నీరు విడుదల చేసినట్టు వివరించారు. ఈ జలాలను పంటలకు వినియోగించొద్దని సూచించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 900 క్యూసెక్కులు తాగునీటి కోసం విడుదల చేయగా, అందులో ప్రకాశం జిల్లాకు 500 క్యూసెక్కులు కేటాయించినట్లు వివరించారు. ఈ కెనాల్ పరిధిలో 23 మంచి నీటి చెరువులు ఉండగా అన్నింటినీ నూరు శాతం నింపేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు మాత్రమే సాగర్ జలాలు విడుదలవుతాయని వెల్లడించారు. ఎస్‌ఈ వెంట ఎన్‌ఎస్పీ డీఈఈ చాట్రగడ్డ రామారావు, ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ, లస్కర్ నందకిషోర్ తదితరులు ఉన్నారు.

28న జాబ్‌మేళా



నరసరావుపేట: పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ఈనెల 28న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించనున్న జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో 13 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం లభిస్తుందని, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, ఫార్మసీ చదివిన 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మేళా జరుగుతుందని వెల్లడించారు. ఔత్సాహిక యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఎస్‌డీసీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95817 94605, 80743 93466, 94409 88148 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ ఎంఆర్ కల్పశ్రీ, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముందుంది ఎన్నికల కాలం

సన్నాహాల్లో అధికారులు తలమునకలు

- ఈవీఎంల పనితీరుపై తనిఖీ ప్రారంభం
- యంత్రాల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ
- రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన
- 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ




నరసరావుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంల తనిఖీ కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

సాక్షి, నరసరావుపేట: మరో ఆరేడునెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలైంది. పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ సిబ్బందికి శిక్షణ వంటి పనులు వడివడిగా సాగుతున్నాయి. అవసరమైన ఈవీఎంలు ఇప్పటికే నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకున్నాయి. వీటి పనితీరుపై తనిఖీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈవీఎంలను సరఫరా చేసిన బెల్ కంపెనీ ఇంజినీర్లు 16 మంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ పరిశీలన జరుగుతోంది. వచ్చేనెల 10 వరకు మొదటి దశ తనిఖీ జరుగుతుందని అధికారులు తెలిపారు.

1,926 పోలింగ్ స్టేషన్లు

పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,926 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిపెట్టారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)కి సంబంధించిన బీయూ (బ్యాలెట్ యూనిట్), సీయూ (కంట్రోల్ యూనిట్), వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్)ను ఒక సెట్ అసెంబ్లీ, మరో సెట్ లోకసభ ఓటింగ్‌కు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఈ మూడు యూనిట్లు కలిగిన ఈవీఎం మిషన్లను తనిఖీ చేసి, సంతృప్తికరంగా ఉన్న వాటిపై ముద్రవేసి భద్రపరుస్తున్నారు. సమస్యలు గుర్తించిన వాటి స్థానంలో కొత్త యూనిట్లను జిల్లాకు తెప్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,288 సీయూ, 5,636 బీయూ, 5,916 వీవీ ప్యాట్‌లు వచ్చాయి. వీటిలో 2,852 పోలింగ్ సమయంలో వినియోగించనుండగా, మిగిలిన యంత్రాలు రిజర్వ్‌డ్, పోలింగ్ సిబ్బందికి ట్రైనింగ్ కోసం వినియోగించనున్నారు.



మాక్ పోలింగ్!

ఈవీఎంలను తనిఖీ చేసే క్రమంలో ప్రతి యంత్రాన్ని ఎన్నికల సమయంలో ఎలా వినియోగిస్తారు అనేదానిని మాక్ పోలింగ్ ద్వారా చెక్ చేయనున్నారు. అంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీఎంలలో వారికి నచ్చిన బటన్లు టెస్ట్ చేసి, ఫలితాలు తనిఖీ చేసి సరిగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలిస్తారు. ఇప్పటికే వీటి పరిశీలన కోసం సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు.

27న డ్రాఫ్ట్ పబ్లికేషన్

జిల్లాలోని ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇంటింటి సర్వే అనంతరం ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురించనున్నారు. అనంతరం నెల రోజుల పాటు వాటిలో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ సమయంలోనూ కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, చిరునామాల మార్పు వంటి ప్రక్రియ కొనసాగనుంది. జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ఎపిక్ కార్డుల పంపిణీ పూర్తికాగా, మూడో విడత కార్డుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. పోస్టల్ ద్వారా కార్డుల పంపిణీ చేస్తున్నారు. కొన్నింటిని సంబంధిత బీఎల్‌ఓలకు పంపి వారి ద్వారా నేరుగా ఓటర్లకు చేరవేస్తున్నారు.

పకడ్బందీగా ఈవీఎంల పరిశీలన



సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల మొదటిదశ పరిశీలన జిల్లాలో ప్రారంభమైంది. రాజకీయ పార్టీలు, బెల్ కంపెనీల ప్రతినిధులు సమక్షంలో ప్రతి యంత్రాన్ని అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం. జిల్లాకు అవసరమైన ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు ఓటర్ల జాబితా తయారీ చురుగ్గా సాగుతోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన శిక్షణను సిబ్బందికి ఇస్తున్నాం.

– శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్

ప్రజా సేవ కోసమే మనం

- జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 126 అర్జీలు స్వీకరణ



కలెక్టరేట్‌లో ప్రజలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: ప్రజా సేవ కోసమే మనందరం ఉన్నామని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరిద్దామని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల వద్ద 126 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వసంతబాబు అర్జీల స్వీకరణలో పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన అర్జీదారులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం చేశారు. దాతలను కలెక్టరేట్ యంత్రాంగం సత్కరించింది.

మోసం చేసిన భర్తపై చర్యలు



కేసానుపల్లి గ్రామంలో చెల్లి శ్రావణసంధ్య అనే యువతిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడి పెళ్లి చేసుకొని ఒక ఆడపిల్ల పుట్టిన తర్వాత ఆమెను వదిలించుకునేందుకు హత్యాయత్నం చేసిన పాపాబత్తుని వినోద్‌కుమార్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి.

– దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం, కులనిర్మూలన పోరాట సమితి నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు

రుణాలు ఎగ్గొట్టిన వారిపై ..



మాకు తెలియకుండా మా పేర్లపై డ్వాక్రా గ్రూపు లీడర్లు బ్యాంకుల ద్వారా రూ.1.5 కోట్ల రుణాలు తీసుకున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రుణాలు రికవరీ చేయాలి. దీనిపై కలెక్టర్ కమిటీ వేసినా పరిష్కారం లభించలేదు. కూలికి వెళ్లి రోజుకు రెండుమూడొందలు సంపాదించుకునే మాపై రూ.3.5 లక్షల అప్పు తీసుకున్నారు. వాటిని మేమెలా తీర్చాలి.

– బాధితులు, తిమ్మాపురం, యడ్లపాడు మండలం

దసరా సెలవుల్లో బడులు తెరిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట: దసరా సెలవుల్లో అన్ని యాజమాన్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలు తెరవడానికి వీలులేదని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో పిల్లలకు వర్క్‌షాపులు, పదో తరగతి ప్రత్యేక తరగతులు వంటివి నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికొస్తే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. దీనిలో ఎవరికీ ప్రత్యేక మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా ఫిర్యాదులను మండల, జిల్లా విద్యా శాఖాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. 1098 చైల్డ్‌లైన్‌కు, 1092 కాల్‌సెంటర్ ఫిర్యాదులు అందించాలని సూచించారు.

జగ్జీవన్‌రామ్, వైఎస్సార్ స్ఫూర్తి ఆదర్శం



జగ్జీవన్‌రామ్, వైఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నంబూరు, డొక్కా

- మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే నంబూరు
- జలాల్‌పురంలో జగ్జీవన్‌రామ్, వైఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణ

పెదకూరపాడు: ప్రజా సంక్షేమం కోసం అనుక్షణం తపించిన బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తి భావి తరాలకు ఆదర్శమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు మండలంలోని జలాల్‌పురంలో జగ్జీవన్‌రామ్, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి డొక్కా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ఇద్దరు మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహానేత వైఎస్సార్ మరణంతో రాష్ట్ర ప్రజలకు ఎంతో నష్టం జరిగిందన్నారు. ఆ నష్టాన్ని పూడ్చేందుకు వైఎస్సార్ వారసుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. తండ్రి ఆశయాలను ముందుకు నడిపిస్తూ, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అంతకు ముందు జలాల్‌పురంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు ఆవిష్కరించడం నా అదృష్టమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదిరెడ్డి సుజాత, క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ షేక్‌మస్తాన్ షరీఫ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపాటియోహాన్, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- మారుమూల పల్లెలకూ మెరుగైన వైద్యం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ధూళిపాళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



ధూళిపాళ్లలో రోగులకు మందుల కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకూ మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. సాధారణంగా ఫ్యామిలీ డాక్టర్ ఆర్థికంగా బలంగా ఉన్న వారికి మాత్రమే ఉంటారని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకూ ఈ సదుపాయం కల్పించారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్‌తోపాటు ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం


మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని భావించి ప్రతి ఇంటికీ వైద్యాధికారులను పంపించి వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

575 మందికి పరీక్షలు

ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎమ్.అనూషారాణి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ కాశీ విశ్వనాథ్ 575 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి 13 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. 633 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్యనిపుణుడు ఎం.కాశిబాబు 143 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 112 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 11 మందిని కాటరాక్ట్ పరీక్షలకు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, సర్పంచ్ కుంభా వీరమ్మ, ఎంపీటీసీ కుంభా బుజ్జి, మాజీ సర్పంచ్ మహాలక్ష్మి, ఉన్నం హుసేనయ్య, ఉటుకూరి నాగేశ్వరరావు, అబ్బూరి వీరాంజనేయులు, మల్లెల చిన్నప్ప, ఎంపీడీవో జీవీ సత్య నారాయణ, వివిధ శాఖల అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.


బాలుడి కిడ్నాప్ కలకలం

- గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు
- తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



షాహిద్ అలీఖాన్ (ఫైల్)

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నగరంలో నాలుగేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. లాలాపేట సీఐ ఎం.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. మంత్రివారిబజారులో నివాసం ఉండే పఠాన్ ఆరిఫ్ ఖాన్ వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఆరిఫ్‌ఖాన్‌కు ముగ్గురు సంతానం. ఆరేళ్ల షాదావలిఖాన్, నాలుగేళ్ల షాహిద్ అలీఖాన్, మూడేళ్ల షాజియా ఉన్నారు. సోమవారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్న షాహిద్ అలీఖాన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్పీ నిచికేష్ షలేఖ్, సీఐ ఎం.శ్రీనివాసరావు క్షణాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. సీసీఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సంగడిగుంటకుచెందిన షేక్ జాకిరాతోపాటు, మరో ఇద్దరు మైనర్లు కలిసి బాలుడిని అపహరించినట్లు గుర్తించారు. బాలుడిని డీఎస్ నగర్‌కు చెందిన పఠాన్ షేర్‌హుస్సేన్ నివాసంలో ఉంచినట్లు గుర్తించి కాపాడారు. బాలుడిని విక్రయించేందుకు అపహరించినట్లు సమాచారం. పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సి ఉందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు అంజయ్య, అమర్‌వర్ధన్, కానిస్టేబుళ్లు కిరణ్, సుబ్బారావు, నాగరాజు, షరీఫ్, ఏఎస్సై ఆంథోనిలను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభినందించారు. అనంతరం బాలుడిని ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ తల్లిదండ్రులకు అప్పగించారు.



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీటీసీ కరీం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): దసరా పండగ పురస్కరించుకుని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అధికచార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. సోమవారం స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో ప్రైవేటు బస్సుల యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా ప్రైవేటు బస్సులు నడిపే నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తే ఉపేక్షించబోమన్నారు. నిబంధనలకనుగుణంగా యాజమాన్యం నడుచుకోవాలన్నారు. సమావేశంలో ఎంవీఐలు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

- చంద్రబాబు ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకున్నారు
- ఓటుకు నోటు కేసులోనూ ముద్దాయి చంద్రబాబే
- ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: చట్టం, ధర్మం, న్యాయం ముందు ప్రజలంతా సమానమేనని, పేదలకు ఒక న్యాయం, ధనవంతులకు ఒక న్యాయం ఉండదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ఆర్కే విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేసి చట్టాల నుంచి తప్పించుకున్నారని, ఇక తప్పించుకోలేరని స్పష్టం చేశారు. తాను ఓటుకు నోటు కేసులో 2017లో కోర్టును ఆశ్రయించానని, నవంబర్ 8న సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు రానుందని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులోనూ చంద్రబాబు ముద్దాయేనని, కానీ వ్యవస్థలను వాటిలోని వ్యక్తులను మేనేజ్ చేయడంతో ప్రపంచంలోనే చంద్రబాబు దిట్ట కనుక ఆలస్యమైందని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అరెస్ట్ చేయలేదని, కేసులో బలమైన ఆధారాలు ఉండబట్టే సీఐడీ అరెస్ట్ చేసిందని, కోర్టు రిమాండ్ విధించిందని స్పష్టం చేశారు. ఈ విషయం టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. అవినీతి చేసిన చంద్రబాబును కాపాడుకోవడం కోసమే ప్రభుత్వంపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని ఎక్కడా ఖండించపోగా చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని విమర్శించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. చంద్రబాబు అవినీతి గురించి రాష్ట్ర ప్రజలందరితోపాటు టీడీపీ నాయకులకు పూర్తిగా అర్థమైంది కనుకే ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. తన సచ్ఛీలతను నిరూపించుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుదేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆర్కే స్పష్టం చేశారు.

ప్రజా ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- కిష్కిందపాలెంలో వైద్యశిబిరం

కొల్లూరు: ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజా ఆరోగ్యానికి శ్రీరామ రక్షలా మారిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. మండలంలోని కిష్కిందపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, వైద్య సేవలు అత్యంత ఖరీదుగా మారిపోయి సామాన్య ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిన తరుణంలో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలను ప్రజలందరికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వద్దకే నేరుగా వైద్యులు వెళ్లడంతో సేవలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 616 మందికి బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతోపాటు, కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచులు గుంటూరు నీలాంబ్రం, టి.కృష్ణమోహన్, సూరపనేని వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణ రావు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్, వైద్యులు పావని, మౌనిక, కావ్యతేజ, బి.రాజ్‌కుమార్, ఎస్.సుష్మ పాల్గొన్నారు.


కిష్కిందపాలెంలో మందులు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4లక్షలు కాజేశారు

- జిల్లా ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు
- జగనన్నకు చెబుదాంలో 54 ఫిర్యాదులు స్వీకరణ

నరసరావుపేట: ముగ్గురు వ్యక్తులు పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.4లక్షలు నగదు తీసుకొని ఉద్యోగం ఇవ్వకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని సత్తెనపల్లి పట్టణానికి చెందిన బొట్టా పెద్దయ్య జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 54 అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులకు పట్టణానికి చెందిన త్రికోటేశ్వరస్వామి దేవస్థానం బోర్డు మెంబర్ మాడిశెట్టి దుర్గామల్లేశ్వరరావు, స్వర్ణలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర పాల్గొన్నారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని కలసి తమ సమస్య వివరిస్తున్న బాధితులు

బంధువులని ఇల్లు అప్పగిస్తే రూ.15లక్షలు కాజేశారు

విదేశాలకు వెళుతూ నా ఇంటిని జాగ్రత్తగా చూసుకోవాల్సిందిగా బంధువులకు ఇల్లు అప్పగించాం. బంధువుల కుమార్తె ఇంటిలోని రూ.15లక్షల నగదు, బంగారం, విలువైన డాక్యుమెంట్లు తీసుకొని వెళ్లిపోయింది. ఆమెపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, దుర్గి మండలం

రూ.3.5లక్షలు చెల్లించి మోసపోయా

ఇంటర్మీడియేట్ చదివిన నాకు రెండు నెలల కిందట టెలిగ్రామ్ యాప్ ద్వారా రూ.100 చెల్లిస్తే అదనపు డబ్బులు ఇస్తామని మెసేజ్ చూసి రూ.100 చెల్లించగా రూ.130 నా అకౌంట్‌కు వేశారు. ఆ విధంగా ఆరు విడతలుగా రూ.3.5లక్షలు చెల్లించగా డబ్బులు తిరిగి వేయలేదు. మోసపోయామని గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కొంత నగదు బ్యాంకు అకౌంట్‌లో ఫ్రీజ్ చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుంటే ఫ్రీజ్ చేసిన నగదును పొందవచ్చని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదుచేసి మాకు న్యాయం చేయండి.

– ఓ యువతి, ఇంటర్మీడియేట్, ముత్యాలంపాడు, దాచేపల్లి మండలం

ప్రమాదాల నివారణకు బోర్డులు ఏర్పాటుచేయండి

పలు అంశాలపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్ర, జిల్లా, మండల అంతర్గత రహదారులపై ప్రమాదాల నివారణకు గుర్తింపు బోర్డుల ఏర్పాటును వచ్చే నవంబరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఎస్ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సచివాలయ సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లను త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆన్ చైల్డ్ లేబర్ కమిటీలో ప్రతి ఒక్క శాఖ నుంచి ఒకరు ఉండేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంపై సమీక్షిస్తూ అకౌంట్‌లు లేనివారికి వేగవంతంగా తెరిపించాలని ఆయా శాఖా అధికారులను ఆదేశించారు. జగనన్న పాల వెల్లువపై సమీక్షిస్తూ పీఎంఈజీపీ కార్యక్రమంతో అనుసంధానం చేసి అన్ని నియోజకవర్గాలలో పూర్తిచేయలన్నారు. జిల్లాలో పశుగణన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు. ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీఎంసీ ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌గా శ్రీనివాస్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ అయిన పెద్ది రోజా సోమవారం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. పెద్ది రోజా స్థానంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్‌గా ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్-2గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించండి

లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యాం ప్రసాద్

మాచర్లరూరల్: పేదవానికి ఆర్థిక భరోసా అందించే ప్రతి ఒక్క ప్రభుత్వ పథకాన్ని లబ్ధిదారులకు సకాలంలో చేరేలా సమష్టిగా పనిచేయాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ కేఎస్ శ్యాం ప్రసాద్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జేఎంఎల్‌బీసీ మీటింగ్‌లో బ్యాంకర్లతో మాట్లాడారు. బ్యాంకు ఉద్యోగులు జగనన్న తోడు, పీఎం స్వామి, పీఎంజేవీ, ఇన్సూరెన్సు వంటి పథకాల లబ్ధిదారులకు రుణాలందించాలన్నారు. రికవరీపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు మాట్లాడుతూ బ్యాంక్ వారికి పథకాల పంపిణీలో, రికవరీలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ వడ్డెంగుంట చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాచర్ల, దుర్గి, రెంటచింతల, కారంపూడి, వెల్దుర్తి, తుమృకోట, విజయపురిసౌత్ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్యాం ప్రసాద్

ఆహార వృథా అరికట్టేందుకు కృషి

ఆహార సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ వై.రాధ

బాపట్ల: ఆహార వృథా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆహార సాంకేతిక కళాశాల డీన్ డాక్టరు వై.రాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా కళాశాలలో సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆహారం మానవ మనుగడకు ప్రధనం అని చెప్పారు. ఆహారాన్ని వృథా చేయకూడదని సూచించారు. ఆహార పదార్థాలను ఏవిధంగా నిల్వ ఉంచుకోవాలని అంశలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆహార సాంకేతిక విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కళాశాల్లో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. విద్యార్థుల్లోని చైతన్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయని వివరించారు. పాఠశాల పిల్లలకు క్విజ్, పోస్టర్ తయారీ, వ్యాసరచన పోటీలతో పాటు కళాశాల విద్యార్థులకు రంగోళి, వివిధ చిరుధాన్యాలతో పోషక విలువలు కలిగిన ఆహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ సంస్థ నుంచి సురేష్ కోడటి, శరత్‌బాబు, గౌతమి, డాక్టర్ బ్లేస్సిసాగర్, డాక్టర్ విమల బీరా, డాక్టర్ సిహెచ్. సోమేశ్వరరావు, కె.సౌజన్య పాల్గొన్నారు.

ఆపరేషన్‌లలో మత్తు వైద్యుల పాత్ర కీలకం

గుంటూరు మెడికల్: ఆపరేషన్ సమయంలో మత్తు వైద్యుల పాత్ర ఎంతో కీలమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎనస్థీషియా డే సందర్భంగా సోమవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ చేయాలంటే తప్పనిసరిగా మత్తు వైద్యుడు అవసరమన్నారు. భరించలేని నొప్పి నుంచి రోగులను కాపాడేవిధంగా వైద్యులు పని చేస్తారన్నారు. ఎనస్థీషియా వైద్యులు ఒత్తిళ్లకు లోనవుతారని తెలిపారు. జీజీహెచ్‌కు మంచిపేరు తీసుకుని రావడానికి ఎనస్థీషియా వైద్యులు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. డాక్టర్ పోలయ్య, డాక్టర్ క్రిస్టాఫర్ పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- మహిళా మార్ట్ ప్రారంభం

పిడుగురాళ్లరూరల్: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా మార్ట్‌లను ప్రవేశపెట్టారని గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళా మార్ట్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోనే ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. మార్ట్‌ల ఏర్పాటుతో మహిళలు ఆర్థిక ప్రగతితో శక్తిగా ఎదుగుతారన్నారు. కార్పొరేట్ కంపెనీలు, ఇతర సూపర్ మార్కెట్‌లకు దీటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళలు రాష్ట్రంలో రాణించబోతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద పెద్ద కంపెనీలు మన మార్ట్‌లతో వ్యాపారం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని వెలుగు సిబ్బంది సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్‌లు షేక్ ఖాశీంబి, బడే సాహెబ్, షేక్ నాగూర్‌బి, సలాం, బైరపోగు కుమారి, ఏలయ్య, ఎంపీటీసీ సభ్యులు యరగాని శ్రీనివాసరావు, నాగిరెడ్డి, వైస్ సర్పంచ్ రాఘవయ్య, సొసైటీ ప్రెసిడెంట్ గోగిరెడ్డి పిచ్చిరెడ్డి, వెన్నా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బండి రామిరెడ్డి, యర్రంరెడ్డి చంద్రారెడ్డి, బండి అంజిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, జొన్నల ఆదిరెడ్డి, సీతారామిరెడ్డి, సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ మహిత, పల్నాడు జిల్లా వైఎస్సార్ క్రాంతి పథకం పీడీ బి.బాలునాయక్, పల్నాడు డీపీఎం చిన్న శ్రీను, హనుమానాయక్, ఏజీఎం చిన్న బుల్లియ్య, ఏపీఎం, సీసీలు నాగరాజు, సీతారామయ్య, ఉమామహేశ్వరరావు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

బాల్యవివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రతిజ్ఞ చేసిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: సమాజంలో బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, దీని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏపీ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ ఆదేశాలను అనుసరించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా అదనపు క్రైమ్ ఎస్పీ చంద్రశేఖర్ జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో బాల్య వివాహ రహిత భారతదేశం ప్రచారం మేరకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో బాల్యవివాహాల నిరోధ ప్రతిజ్ఞ చేయించారు. నా కుటుంబంలో అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21ఏళ్లు నిండకుండా వివాహం చేయమని, బాల్య వివాహంలో పాల్గొనను, ప్రోత్సహించనని, అమ్మాయిలు పట్ల ఎటువంటి వివక్ష చూపనని, అమ్మాయి, అబ్బాయిని చదువు మానిపించకుండా చదివిస్తామని ప్రతిజ్ఞ చేశారు. విద్య, బాల్యవివాహాలు, రక్తహీనతపై తప్పనిసరిగా చర్చిస్తామని, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ తయారు చేయడం కోసం నా వంతు బాధ్యత నేను వహిస్తానని ప్రతిజ్ఞ చేశారు. అదనపు ఎస్పీలు డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నకృష్ణ, సీఐ ప్రభాకర్ రావు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది

రైతులకు నిరంతరాయంగా 9గంటల విద్యుత్

విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు

నకరికల్లు: భూగర్భజలాలు అడుగంటి మెట్ట ప్రాంతాల్లో బోర్ల నుంచి సక్రమంగా నీరు రాకపోవడంతో అక్కడక్కడ పంటలు ఎండుతున్నాయే తప్ప తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోత విధించడం లేదని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు సోమవారం స్పష్టం చేశారు. ఓ దినపత్రికలో తొమ్మిది గంటల విద్యుత్ ఉత్తమాటలే అన్న కథనంలో వాస్తవం లేదని అన్నారు. విద్యుత్ వినియోగం ఉత్పత్తుల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్‌కు కొనుగోలు చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు తొమ్మిది గంటలు నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. జూన్ నెల నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడం, పంటల సాగు కోసం అధికశాతం బోర్ల వాడకం ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని అన్నారు.

టేబుల్ టెన్నిస్ చాంపియన్‌గా స్ఫూర్తి నైనా



కారెంపూడి: అండర్– 11 ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను స్ఫూర్తి నైనా ఐదోసారి గెలుచుకుంది. అనంతరపురంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ సోమవారం ముగిసింది. స్ఫూర్తినైనా గోల్డ్ మెడల్ సాధించింది. ఈ ఏడాది టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నిర్వహించిన ఐదు టోర్నమెంట్‌లలో నంబర్ వన్‌గా నిలిచి అరుదైనా రికార్డు నమోదు చేసింది. పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన చదల స్ఫూర్తి నైనా కారెంపూడిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ప్రైవేటు స్కూల్లో పీఈటీగా పని చేస్తున్న తండ్రి ఏసు బాబు కుమార్తెకు స్వయంగా శిక్షణ ఇస్తూ క్రీడా స్ఫూర్తిని రగిలిస్తున్నారు.

లబ్ధిదారులకు కార్లు, ఉద్యోగ పత్రాలు అందజేత

నవోదయంకు 251 దరఖాస్తులు

నరసరావుపేట: జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి నెలా 14వ తేదీన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుంది. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న దీనికి పెద్దఎత్తున స్పందన లభించింది. బ్యాంకర్లు సైతం దీనికి రుణాలు అందిస్తుండడంతోపాటు రికవరీకి కూడా మంచి స్పందన లభిస్తుంది. గత నవోదయంలో దరఖాస్తు చేసుకున్న బి.రమేష్, ఎన్.విక్టర్‌పాల్‌లకు జిల్లా కలెక్టర్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. వీరికి హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఏడాదికి రూ.2.7లక్షలు వేతనం లభించనుంది. నవోదయంలో దరఖాస్తు చేసుకున్న నరసరావుపేటకు చెందిన కట్టి విజయ్‌కుమార్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.11లక్షల విలువ చేసే కారు అందజేయగా, సత్తెనపల్లికి చెందిన మీలం రాజేశ్వరికి స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున రూ.13లక్షలు విలువచేసే కారు అందజేశారు. వీరు తీసుకున్న రుణంలో 40శాతం సబ్సిడీ పొందనున్నారు. నరసరావుపేటకు చెందిన ఎం.చిన్నసామ్రాజ్యం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పీఎంజీ పథకం కింద మెడికల్ లాబ్‌ను మంజూరు చేసి రూ.10లక్షల విలువచేసే యూనిట్ కాస్ట్‌ను అందజేశారు. వీటికి సంబంధించిన పత్రాలు, తాళాలను జిల్లా కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులు ఐ.మురళి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ అందజేశారు.


లబ్ధిదారుకు కారు తాళాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

నవోదయంలో 251 దరఖాస్తులు స్వీకరణ

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన నవోదయంలో 251 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ఓపెన్ ఏరియా ప్రాంగణంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు, యువతీ యువకులు పాల్గొని రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, బ్యాంకు రుణాలు, పరిశ్రమలు, యువత సాధికారిక లక్ష్యంగా నవోదయం కార్యక్రమం కొనసాగింది. జిల్లా నోడల్ అధికారి ఓబుల నాయుడు, కె.సంజీవరావు, కలెక్టరేట్ స్టాఫ్, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మాలేపాటి బాధ్యతలు స్వీకారం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మాలేపాటి హరిప్రసాద్ సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ రాజీనామా ఆమోదం పొందటంతో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా మాలేపాటి వ్యవహరిస్తారని కమిషనర్ ప్రకటించారు. దీంతో ఆయన మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కొన్ని ఫైల్స్‌పై సంతకాలు చేశారు.